క్లుప్తంగా

ఘనంగా ఉరుసు



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న నిర్వాహకులు

తుగ్గలి : మండలంలోని చెన్నంపల్లి పురాతన కోటలో కొలువైన హజరత్ సయ్యద్ షా శవా సప్ప స్వామి ఉరుసు మహోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా నిర్వాహకులు మేళతాళాలతో వెళ్లి దర్గాపై చద్దర్ ఉంచి పూలమాలలు ఉంచి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మతాలకతీతంగా గ్రామస్తులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్గాను దర్శించుకొని చక్కెర చదివింపులు చేసి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం దర్గా ఆవరణలో భారీ ఎత్తున అన్నదానం చేశారు. ఉరుసు సందర్భంగా గ్రామంలో మిఠాయి, గాజులు, బొమ్మల దుకాణాలు వెలిశాయి. బంధు మిత్రులు రాకతో గ్రామంలో సందడి నెలకొంది.

వాహనాల తనిఖీ

పత్తికొండ రూరల్: పత్తికొండలోని స్టేట్ బ్యాంకు సమీపంలో ప్రధాన రోడ్డుపై ఎస్ఐ వెంకటేశ్వర్లు శనివారం వాహనాల తనిఖీ నిర్వహించారు. వాహనాలను ఆపి రికార్డులు, డ్రైవింగ్ లైసెన్స్‌లను పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడుపుతున్న వారికి జరిమానా విధించారు.

హాజరు నమోదు తప్పనిసరి

కృష్ణగిరి: ఉపాధి పనులు జరిగే ప్రదేశానికి ప్రతి రోజు మస్టర్లు తీసుకెళ్లడంతోపాటు కూలీల హాజరు తప్పక వేయాలని ఎంపీడీఓ మోహన్‌కుమార్ సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని ఎరుకలచెరువు గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను శనివారం ఆయన పరిశీలించారు. పని ప్రదేశంలో మస్టర్లు లేకపోవడంతో సంబంధిత సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం కూలీలతో మాట్లాడారు. ఈసీ మధుకృష్ణ, సిబ్బంది ఉన్నారు.

అభివృద్ధిపై దృష్టి సారించండి



అధికారులతో సమీక్షిస్తున్న డీఎల్‌డీఓ అనురాధ

మద్దికెర : అధికారులు తమ గ్రామాల్లో అభివృద్ధిపై దృష్టి సారించాలని డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి అనురాధ సూచించారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం మంజూరు చేస్తున్న నిధులను సక్రమంగా వినియోగించి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలన్నారు.

తహసీల్దార్ బదిలీ

హొళగుంద: తహసీల్దార్ సతీష్ బదిలీ అయ్యారు. ఆయనకు ఉన్నతాధికారులు ఈ నెల 7న పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్ట్ మెయిన్ కెనాల్ యూనిట్–3 కోవూరు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం ఆయన అక్కడ బాధ్యతలు చేపట్టగా డిప్యూటీ తహసీల్దారు నిజాముద్దీన్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు.

ఆర్‌ఎస్‌కేల ద్వారా కందుల కొనుగోలు

దేవనకొండ: మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులు పండించిన కందులను కొనుగోలు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని మండల వ్యవసాయ అధికారి శనివారం తెలిపారు. మండలంలో ఖరీఫ్ సీజన్‌లో 1,450 ఎకరాల్లో కంది పంట సాగైందన్నారు. కందులకు కనీస మద్దతు ధర రూ.7,550తో కొనుగోలు చేస్తారని, పంటల నమోదు చేయించుకున్న రైతులు గ్రామాల్లోని రైతుసేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో సర్వేయర్‌కు గాయాలు



చికిత్స పొందుతున్న నాగేంద్రమ్మ

పత్తికొండ రూరల్ : ఆస్పరి మండలం హలిగేర గ్రామంలో గ్రామ సర్వేయర్‌గా పని చేస్తున్న నాగేంద్రమ్మ శనివారం పత్తికొండలోని ఆర్డీఓ కార్యాలయంలో డివిజన్ సర్వేయర్ల సమావేశానికి స్కూటీలో వస్తుండగా చిన్నహుల్తి–దేవనబండ గ్రామాల మధ్యన కుక్కను తప్పించబోయి స్కూటీ అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో తీవ్రంగా గాయపడిన ఆమెను స్థానికులు చికిత్స నిమిత్తం పత్తికొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆర్డీఓ భరత్‌నాయక్ సిబ్బంది ఆమెను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని ఆర్డీఓ వైద్యులకు సూచించారు.

విద్యార్థినులకు వైద్య పరీక్షలు

వెల్దుర్తి: స్థానిక అంబేడ్కర్ ఎస్సీ బాలికల గురుకులం విద్యార్థిని రాణి డెంగీ జ్వరంబారిన పడటంతో వైద్య సిబ్బంది శనివారం గురుకులంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. విద్యార్థినులకు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు.

కిశోరి వికాసం లక్ష్యం నెరవేర్చాలి

వెల్దుర్తి: బాల్య వివాహాలు, లైంగిక దాడులు, వేధింపులపై గ్రామ, మండల స్థాయిలో కిశోర బాలికలకు అవగాహన కల్పించినపుడే కిశోరి వికాసం లక్ష్యం నెరవేరుతుందని ఐసీడీఎస్ వెల్దుర్తి ప్రాజెక్ట్ సీడీపీఓ ల్యూక్ అన్నారు. శనివారం స్థానిక సీడీపీఓ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.



శిథిలావస్థకు చేరిన ఏరూరు ప్రాథమిక పాఠశాల | కాజీపురంలో కూలడానికి సిద్ధంగా అంగన్‌వాడీ కేంద్రం | శిథిలావస్థకు చేరిన కాజీపురం ప్రాథమిక పాఠశాల

అలా వదిలేశారు!

- గ్రామాల్లో శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ భవనాలు
- అసాంఘిక కార్యకలపాలకు నిలయాలుగా మారిన వైనం
- కొన్ని కూలడానికి సిద్ధంగా..
- ఆందోళన వ్యక్తం చేస్తున్న ప్రజలు
- పట్టించుకోని ఆయా శాఖల అధికారులు

చిప్పగిరి: మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో వివిధ ప్రభుత్వ భవనాలు శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారాయి. కాజీపురం, ఏరూరు తదితర గ్రామాల్లో ఉన్న పాఠశాలల, పలు అంగన్‌వాడీ కేంద్రాల శిథిలావస్థకు చేరడంతో నూతన భవనాలు నిర్మించారు. దీంతో పాత భవనాలు కూల్చకుండా అలాగే వదిలేయడంతో ప్రమాదకరంగా మారాయి. వీటిలో కొన్ని భవనాలు బాగానే ఉన్నప్పటికీ వినియోగానికి నోచుకోక శిథిలమైపోతున్నాయి. ఇక భవనాలు ఖాళీగా ఉండటంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. ముఖ్యంగా ఏరూరులో శిథిలావస్థకు చేరిన ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, నూతన పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం ఒకే ప్రాంగణంలో ఉండటంతో శిథిలమైన భవనం కూలిపోతుందేమోనని పిల్లల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి శిథిలమైన భవనాలను కూల్చివేసి, వినియోగానికి ఉపయోగపడే భవనాలను అద్దె భవానాల్లో కొనసాగుతున్న కార్యాలయాలకు కేటాయిస్తే బాగుంటుందని ఆయా గ్రామాల ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



ఏరూరులో పడిపోయే దశలో అంగన్‌వాడీ కేంద్రం



చిప్పగిరిలో నిరుపయోగంగా రెవెన్యూ కార్యదర్శి కార్యాలయం

28న జాబ్‌మేళా

పత్తికొండ రూరల్ : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పత్తికొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 28వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఆనంద్ రాజ్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ మాధురి శనివారం తెలిపారు. నవభారత్ ఫర్టిలైజర్, స్పందన స్ఫూర్తి, క్రెడిట్ యాక్సెస్ గ్రామీణ లిమిటెడ్ కంపెనీలు పాల్గొంటున్నట్లు తెలిపారు. ఉదయం 9గంటల నుంచి మేళా ప్రారంభమవుతుందన్నారు. టెన్త్, ఇంటర్మీడియెట్, డిగ్రీ చదివి 19–35సంవత్సరాల్లోపు నిరుద్యోగ యువతీ, యువకులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇంటర్వ్యూకు వచ్చే నిరుద్యోగ అభ్యర్థులు తమ పూర్తి బయోడేటాతో పాటు విద్యార్హత పత్రాలు, జిరాక్స్, ఆధార్ కార్డు, రెండు ఫొటోలతో హాజరు కావాలని సూచించారు. వివరాలకు సెల్ : 9603303354 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

సచివాలయం తనిఖీ

ఆస్పరి: మండలంలోని చిగిళి గ్రామ సచివాలయాన్ని ఎంపీడీఓ గీతావాణి శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందితో ఆమె మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా, అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరించాలని సూచించారు. ముఖ్యంగా విధి నిర్వహణలో బాధ్యతగా వ్యవహరించాలన్నారు. గ్రామంలో ఇంటింటి సర్వే చేసి ప్రభుత్వ పథకాలకు అర్హులను గుర్తించాలని చెప్పారు.

చట్టాలపై అవగాహన అవసరం

- పత్తికొండ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఇన్‌చార్జ్ జడ్జి ఏవీఎస్ శ్రీవల్లి



మహిళలకు జ్యూట్ బ్యాగ్‌లు అందజేస్తున్న జడ్జి ఏవీఎస్ శ్రీవల్లి



మాట్లాడుతున్న ఆలూరు జూనియర్ సివిల్ జడ్జి కె.హేమ

తుగ్గలి : చట్టాలపై అవగాహన ఉంటే ఎలాంటి సమస్యనైనా సులభంగా ఎదుర్కోవచ్చని పత్తికొండ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఇన్‌చార్జ్ జడ్జి ఏవీఎస్ శ్రీవల్లి తెలిపారు. విధాన్ సె సమాధాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జాతీయ మహిళా కమిషన్, జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మహిళా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ప్యానల్ న్యాయవాది సూరజ్‌నబీ అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో జడ్జి మాట్లాడారు. చిన్నచిన్న సమస్యలను ఎక్కడికక్కడే పరిష్కరించుకోవాలని, సమస్య ఎక్కువైనప్పుడే పోలీస్ స్టేషన్లు, కోర్టులను ఆశ్రయించాలన్నారు. న్యాయం కోరే మహిళలకు ఉచిత న్యాయ సహాయం అందజేస్తామని తెలిపారు. అనంతరం మహిళలకు జ్యూట్ బ్యాగ్‌లు అందజేశారు. తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీఓ విశ్వమోహన్, సీడీపీఓ లలిత, ఎస్ఐ కృష్ణమూర్తి, ఏపీఎం రాధాకృష్ణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సుమిత్రమ్మ, అంబిక, న్యాయవాదులు కాశీవిశ్వనాథ్, నాగరాజు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

ఆస్పరి: చట్టాలపై మహిళలు అవగాహన కలిగి ఉండాలని ఆలూరు జూనియర్ సివిల్ జడ్జి కె.హేమ అన్నారు. శనివారం ఆస్పరిలో సర్పంచ్ మూలింటి రాధమ్మ అధ్యక్షతన జాతీయ మహిళా కమిషన్, జాతీయ న్యాయ సేవాధికార సేవా సంస్థ ఆధ్వర్యంలో మహిళా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ బాల్య వివాహాలను అరికట్టాలని, బాల కార్మికులుంటే బడిలో చేర్పించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. న్యాయవాదులు వాయుజీవోత్తమరావు, ప్రవీణ్‌కుమార్, సీడీపీఓ మద్దమ్మ, ఏపీఎం జానర్దన్, అంగన్‌వాడీ సూపర్ వైజర్లు శివలింగమ్మ, పద్మావతి పాల్గొన్నారు.

వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ

పత్తికొండ రూరల్ : ఓటర్ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన జిల్లా స్థాయి వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో పత్తికొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థినులు ఉత్తమ ప్రతిభ చూపారు. వ్యాసరచనలో బీఎస్సీ కెమిస్ట్రీ మొదటి సంవత్సరం చదువుతున్న ఎస్.సమీర మూడవ బహుమతి, ఉపన్యాసంలో వృక్షశాస్త్రం ప్రథమ సంవత్సరం చదువుతున్న కరణం గీత ద్వితీయ బహుమతిని జాయింట్ కలెక్టర్ నవ్య చేతుల మీదుగా అందుకున్నట్లు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి రామకృష్ణ శనివారం తెలిపారు.

ప్రత్యేక పూజలు

ఆస్పరి: మండలంలో హలిగేర గ్రామ సమీపంలోని కొండల్లో వెలసిన కూర్మనారాయణస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో కూర్మనారయణస్వామి, హనుమన్న స్వామి వార్లకు గంగ పూజ, మంగళహారతులు తదితర పూజలు చేపట్టారు.

బీమా సొమ్ము అందజేత

దేవనకొండ: నేలతలమరి గ్రామానికి చెందిన ఉపాధి కూలీ ఒంటెల రంగన్న గతేడాది జూన్‌లో ఉపాధి పని చేస్తూ గుండెపోటుకు గురై మృతిచెందాడు. మృతుడికి రూ.50 వేలు బీమా మంజూరు కావడంతో శనివారం ఎంపీడీఓ సూర్యనారాయణ, ఏపీఓ రత్నం నామినీ అయిన భార్య ఒంటెల నాగమ్మకు అందజేశారు.

నివాళి

హాలహర్వి: వైఎస్సార్‌సీపీ మండల కేంద్రానికి చెందిన సీనియర్ నాయకుడు తాలూరు దేవేంద్రప్ప(68) అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పార్టీ మండల కన్వీనర్ రామరెడ్డి గ్రామానికి చేరుకుని మృతదేహంపై పూలమాల ఉంచి నివాళులర్పించారు.

కృష్ణగిరి: మండలంలోని కర్లకుంట గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు బోయ చిన్న శివన్న (55) శనివారం అనారోగ్యంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి గ్రామానికి చెరుకుని మృతదేహంపై పూలమాల ఉంచి నివాళులర్పించి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అలాగే..అమకతాడు గ్రామానికి చెందిన పార్టీ కార్యకర్త ధర్మవరం సోమన్న మృతి చెందటంతో మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

స్టడీ మెటీరియల్ విడుదల

హొళగుంద: పది పరీక్షలో మంచి మార్కులు సాధించాలని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నజీర్ అహమ్మద్ కోరారు. శనివారం పదో తరగతి విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా ఎస్‌టీయూ ఏపీ అకడమిక్ కమిటీ రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను టీచర్లతో కలిసి ఆవిష్కరించారు. ఎస్‌టీయూ నాయకులు దస్తగిరివలి, రామచంద్ర, ప్రభాకర్, గోపాల్, పోతులూరు మురళి పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత

తుగ్గలి : మండలంలోని చెన్నంపల్లి గ్రామానికి చెందిన దస్తగిరి 20 రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. కాగా అతడితో పాటు పదో తరగతి 2010లో చదివిన మిత్ర బృందం శనివారం గ్రామానికి వెళ్లి దస్తగిరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మిత్రులంతా కలిసి బాధిత కుటుంబానికి రూ.31వేలు ఆర్థిక సాయం అందించారు.

గజ్జహళ్లి తలారికి బెస్ట్ బీఎల్ఓ అవార్డు



కర్నూలులో జాయింట్ కలెక్టర్ నుంచి అవార్డు అందుకుంటున్న తలారి రాఘవేంద్ర

హొళగుంద: తనకు అప్పగించిన విధులను అంకిత భావంతో నిర్వహించి ఉన్నతాధికారుల మన్ననలు పొందిన గజ్జహళ్లి తలారి రాఘవేంద్రకు ఉత్తమ అవార్డు వరించింది. తలారి రాఘవేంద్ర గజ్జహళ్లి గ్రామం పోలింగ్ బూత్ నంబరు–3కు బూత్‌స్థాయి అధికారిగా వ్యవహరిస్తున్నాడు. తాను అందించిన ఉత్తమ సేవలకు శనివారం కర్నూలులో 15వ జాతీయ ఓటరు దినోత్సవ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ నవ్య బెస్ట్ బీఎల్ఓ అవార్డుతో పాటు ప్రశంస పత్రాన్ని అందజేశారు. రాఘవేంద్రను ఇన్‌చార్జ్ తహసీల్దారు నిజాముద్దీన్, వీఆర్ఓలు, తోటి వీఆర్ఏలు, రెవెన్యూ సిబ్బంది అభినందించారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న లలిత

వెల్దుర్తి: అధికారంలోకి వస్తే తమ డిమాండ్లు నెరవేరుస్తామని హామీనిచ్చిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికైనా సమస్యలు పరిష్కరించకపోతే దేశవ్యాప్తంగా ఉద్యమిస్తామని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ ఆల్ ఇండియా ఫెడరేషన్ జాతీయ ఉపాధ్యక్షురాలు జె.లలిత హెచ్చరించారు. శనివారం స్థానిక సీడీపీఓ కార్యాలయం వద్ద అసోసియేషన్ స్థానిక నేతలతో సమావేశం నిర్వహించి భవిష్యత్ కార్యాచరణపై చర్చించి విలేకరులతో మాట్లాడారు. దేశంలోని అంగన్‌వాడీ కేంద్రాలలో 20 లక్షల మందికి పైగా స్త్రీ శిశు సంక్షేమ శాఖలో 50 ఏళ్లు పైబడి పనిచేస్తున్నా తమకు నేటికీ ఉద్యోగ భద్రత లేదన్నారు. వర్కర్‌కు రూ.11,500, హెల్పర్స్‌కు రూ.7వేల అతి తక్కువ గౌరవ వేతనంతో పని చేస్తున్నామన్నారు. కనీస వేతనం రూ.26 వేలు అమలు చేస్తూ, గ్రాట్యుటీ తదితర తమ హక్కులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 23,24 తేదీల్లో భువనేశ్వర్‌లో నిర్వహించే కేంద్ర సమావేశంలో నిర్ణయించి, తమతో కలిసి వచ్చే అన్ని యూనియన్లతో కలిసి పోరాడేందుకు కార్యాచరణ రూపొందిస్తామన్నారు. అసోసియేషన్ జిల్లా, మండల ప్రతినిధులు సంధ్యారాణి, అంగన్‌వాడీ ఉద్యోగులు శిరీష, సురేఖ, సుమలత, జ్యోతి, అరుణ, గంగ, హేమలమ్మ, చాందిని పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

- ఫీల్డ్ అసిస్టెంట్ ఈరన్న హత్యపై వెల్లువెత్తిన నిరసన
- నల్ల రిబ్బన్లతో ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి సిబ్బంది విధులకు హాజరు
- హత్యను ఖండించిన ప్రజాసంఘాల నాయకులు



ఆస్పరిలో నిరసన తెలుపుతున్న ఫీల్డ్ అసిస్టెంట్లు, ప్రజాసంఘాల నాయకులు

ఆలూరు: అరికెర గ్రామానికి చెందిన ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ కురుబ ఈరన్న(45)ను అదే గ్రామానికి చెందిన కూటమి నాయకులు హత్య చేయడంపై ఆలూరు, పత్తికొండ నియోజకవర్గాల్లో ఉపాధి పథకం సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు నల్ల రిబ్బన్లు ధరించి నిరసన వ్యక్తం చేశారు. వివిధ ప్రజా సంఘాల నాయకులు హత్యను ఖండించారు. హత్యా రాజకీయాలు సరికాదని, అభివృద్ధితోనే ప్రజల మనస్సుల్లో స్థానం సంపాదించాలని సూచించారు. ఆలూరు నియోజకవర్గం మాదాసి/మాదారి కురుబ సంఘం కన్వీనర్ కొడికే రాజు, ప్రధానకార్యదర్శి మల్లయ్య తదితరులు మాట్లాడుతూ నిందితులను శిక్షించాలని డిమాండ్ చేశారు.

చిప్పగిరి: ఫీల్డ్ అసిస్టెంట్ బండారి కురువ ఈరన్నను హత్యచేసిన నిందితులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని మండలంలోని ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక మండల కార్యాలయంలో ఉపాధి హామీ పథకం సిబ్బంది, మండలంలోని ఫీల్డ్ అసిస్టెంట్‌లు మృతుడికి సంతాపం తెలుపుతూ మౌనం పాటించారు. ఏపీఓ జుబేర్ అహమ్మద్, ఫీల్డ్ అసిస్టెంట్‌లు లక్ష్మన్న,ఆనంద్,కదిరప్ప,మారుతి,పులిరాజు, దేవేంద్ర,రాఘవేంద్ర పాల్గొన్నారు.

వెల్దుర్తి: ప్రభుత్వ ఉద్యోగులపై హత్యా రాజకీయాలు తగదని ఏపీఓ లక్ష్మన్న అన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ ఈరన్న మృతికి శనివారం స్థానిక ఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయంలో ఏపీఓ, ఈసీ, సిబ్బంది మౌనం పాటించి సంతాపం వ్యక్తం చేశారు.

ఆస్పరి: ఫీల్డ్ అసిస్టెంట్ ఈరన్నను హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ప్రజా సంఘాల నాయకులు బాలకృష్ణ, విరుపాక్షి, చంద్రశేఖర్, రామాంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఏఐటీయూసీ, సీఐటీయూ ఆధ్వర్యంలో మండలంలోని ఫీల్డ్ అసిస్టెంట్లు, ప్రజా సంఘాల నాయకులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. దాడులను అరికట్టాలని డిమాండ్ చేస్తూ ఎంపీడీఓ గీతావాణికి వినతి పత్రం ఇచ్చారు. రవి, రంగస్వామి, క్రిష్ణమూర్తి, అశోక్‌కుమార్, మంజునాథ్, రాముడు పాల్గొన్నారు.

కృష్ణగిరి: అలూరు మండలం అరికెరలో శుక్రవారం ఫీల్డ్ అసిస్టెంట్ ఈరన్న హత్యకు నిరసనగా శనివారం స్థానిక ఉపాధి కార్యాలయం వద్ద ఉపాధి సిబ్బంది నల్లబ్యాడ్జీలతో నిరసన తెలియజేసి మౌనం పాటించారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి ఘటనలు పునావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి సిబ్బంది మధుకృష్ణ, శేషిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేవనకొండ: ఫీల్డ్ అసిస్టెంట్ ఈరన్న హత్య దారుణమని, హతులను కఠినంగా శిక్షించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బి.వీరశేఖర్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఫ్యాక్షన్ నుంచి సామాన్య ప్రజానీకం ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నారని ఇలాంటి ఘటనలు జరగకుండా పోలీసుశాఖ గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. మండల కార్యదర్శి అశోక్, వ్యవసాయ కార్మిక సంఘం మండల ఉపాధ్యక్షుడు యూసుఫ్‌బాషా ఉన్నారు.

హాలహర్వి: ఫీల్డ్ అసిస్టెంట్ హత్యకు నిరసనగా ఫీల్డ్ అసిస్టెంట్లు శనివారం ఎంపీడీఓ కార్యాలయం ముందు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలియజేశారు. వారు మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్‌పై దాడి చేసి హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లపై రాజకీయ ఒత్తిళ్లు లేకుండా అధికారులు చూడాలన్నారు. ఈసీ దేవదాసు, టెక్నికల్ అసిస్టెంట్లు హంపయ్య, రాముడు, నాగరాజు, శ్రీధర్, నెట్టికంటి నాగరాజు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మద్దికెర : రాజకీయ పార్టీలు హత్యా రాజకీయాలు ప్రోత్సహించరాదని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు రేలంపాడు వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్ ఈరన్నను హత్య చేయడం దారుణమన్నారు. ఒత్తిళ్లకు తలొగ్గకపోతే హత్య చేస్తారా అని ప్రశ్నించారు. ఇకముందు ఇలాంటి సంఘటనలు జరగకుండా పోలీసులు నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు.



హాలహర్విలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

‘ఈరన్న హత్యలో మా ప్రమేయం లేదు’

ఆలూరు రూరల్: మండలంలోని అరికెర గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ ఈరన్న హత్యలో తన ప్రమోయం ఉందని, మా ప్రోత్సాహంతోనే హత్య చేశారని ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి అనడం తగదని టీడీపీ ఇన్‌చార్జ్ వీరభద్ర గౌడ్ అన్నారు. ఓర్వలేకనే రాజకీయంగా కుట్ర చేస్తున్నారని చెప్పారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాము సొమ్ములని, ఫ్యాక్షన్‌కు వ్యతిరేకమని తెలిపారు. హత్య కేసులో తమపై ఎందుకు ఆరోపణలు చేస్తున్నారో తెలియడం లేదన్నారు. గొడవలకు దూరంగా ఉండే తన కుమారుడు గిరి మల్లేష్ హస్తం ఉందని చెప్పడం సరైందికాదన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ మార్పు కోసం సర్పంచ్ తీర్మానం ఇస్తారు అన్నందుకే గాదిలింగ అనే వ్యక్తికి లెటర్ ఇచ్చామన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని పోలీసులను కోరామన్నారు.

ఓటే మన ఆయుధం

- ఘనంగా జాతీయ ఓటరు దినోత్సవం

పత్తికొండ రూరల్ : ఓటు రాజ్యాంగం మనకు కల్పించిన హక్కు అని పత్తికొండ ఆర్డీఓ భరత్‌నాయక్ అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక అంబేడ్కర్ కూడలి నుంచి నాలుగు స్తంభాల మండపం వరకు ఓటరు చైతన్య నినాదాలతో ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఎన్నికల డిప్యూటీ తహసీల్దారు లక్ష్మినారాయణ, కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ పవన్ కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

వెల్దుర్తి: జాతీయ ఓటర్ల దినోత్సవంపై శనివారం తహసీల్దార్ చంద్రశేఖర్ వర్మ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి సాగిన ర్యాలీ పాతబస్టాండు వరకు సాగింది. పాత బస్టాండులో ప్రతిజ్ఞ చేశారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు.

తుగ్గలి : రాజ్యాంగం ప్రతి ఒక్కరికీ కల్పించిన వజ్రాయుధం ఓటు హక్కు అని, ఓటరుగా నమోదైన వారంతా నిష్పక్షపాతంగా, నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని తహసీల్దార్ రమాదేవి అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా శనివారం తుగ్గలిలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీఓ కార్యాలయం సమీపంలో మానవహారం ఏర్పాటు చేసి ప్రతిజ్ఞ చేశారు. రెవెన్యూ, వెలుగు అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మద్దికెర : నిజాయితీగా పనిచేసి దేశాభివృద్ధికి పాటుపడే నాయకులను చట్టసభలకు పంపించేందుకు ప్రతి ఒక్కరూ తమ ఓటును వజ్రాయుధంగా వాడుకోవాలని మనం వేసే ఓటు అభివృద్ధికి నాంది అని తహసీల్దార్ హుసేన్‌సాహెబ్ అన్నారు. శనివారం జాతీయ ఓటరు దినోత్సవ సందర్భంగా మండల కేంద్రంలో రెవెన్యూ అధికారులతో ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. డీటీ శ్రీదేవి, ఆర్ఐ రవికుమార్, వీఆర్వోలు రంగస్వామి, పక్కీరప్ప, శ్రీరాములు, రామాంజులు పాల్గొన్నారు.

ఆస్పరి: ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటు కీలకమని తహసీల్దార్ శివ శంకర్‌నాయక్ అన్నారు. శనివారం ఆస్పరిలో స్థానిక హైస్కూల్ విద్యార్థులు, తహసీల్దార్, డీటీ రామేశ్వరరెడ్డి, రీ సర్వే డీటీ భీమేష్ విద్యార్థులు ప్రతిజ్ఞ చేసి ర్యాలీ నిర్వహించి మానవహరంగా నిలిచారు.

కృష్ణగిరి: ఓటుహక్కు వజ్రాయుధంతో సమానమని తహసీల్దార్ దేవ చంద్రశేఖర్ అన్నారు. శనివారం మండల కేంద్రమైన కృష్ణగిరిలో ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా కార్యాలయం నుంచి ర్యాలీగా వెళ్లి బస్టాండ్ వద్ద మానవహారం నిర్వహించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఎంఈఓ–2 మద్దయ్య, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

హాలహర్వి: ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ నజ్మాబాను తెలిపారు. మండలకేంద్రంలో విద్యార్థులు, అధికారులతో కలిసి ర్యాలీ నిర్వహించి, ప్రతిజ్ఞ చేయించారు. రీ సర్వే డీటీ బ్రహ్మయ్య, ఆర్ఐ మహేష్ పాల్గొన్నారు.

హొళగుంద: ఓటు అనే ఆయుధంతో నవ సమాజాన్ని నిర్మించుకోవాలని ఇన్‌చార్జ్ తహసీల్దారు నిజాముద్దీన్ అన్నారు. శనివారం హొళగుందలో విద్యార్థులతో కలిసి ర్యాలీ చేపట్టారు. హెచ్ఎం నజీర్ అహమ్మద్, వీఆర్ఓలు పాల్గొన్నారు.

దేవనకొండ: ఓటర్ల దినోత్సవాన్ని తహసీల్దార్ లోకేశ్వరయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక జెడ్పీ పాఠశాల విద్యార్థులు, రెవెన్యూ అధికారులతో కలిసి ర్యాలీ నిర్వహించారు.

చిప్పగిరి: ఓటరు నమోదు నిరంతర ప్రక్రియ అని తహసీల్దార్ ఇజాజ్ అహమ్మద్ అన్నారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి అంబేద్కర్ కూడలి వరకు విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహించి ఓటు హక్కుపై అవగాహన కల్పించారు.



పత్తికొండలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఆర్డీఓ భరత్‌నాయక్

ఆలూరు రూరల్: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రధానమైందని ఆలూరు అసెంబ్లీ అసిస్టెంట్ ఎలక్టోరల్ అధికారి గోవింద్ సింగ్ అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం స్థానిక ప్రభుత్వ బాలుర పాఠశాల–2 ఆవరణలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, విద్యార్థులు